# ★ ప్రయోజకుడు ★

రచన:
సింగరాజు రామచంద్రమూర్తి

"మన శంకరం పెళ్ళట తెలుసా ?" అడిగాడు విశ్వనాథం కాఫీ తాగుతున్న వాడినల్లా ఆపేసి "ఎప్పుడూ ?" అన్నాను ఆశ్చర్యంగా.

శంకరం పెళ్ళిచేసుకునేందుకు తగడని గాని, వయస్సు ముదిరిందనిగాని కాదు నేను ఆశ్చర్యపోయింది- ఆఫీసులో చాలా మందితో కన్నా నీతో చనువుగా ఉంటాడు శంకరం. అటువంటిది నాకు తెలియకుండా....

నాకు తెలియకుండా నాకన్న ముందు తెలుసుకున్న విషయాన్ని నాకు చెప్పి నా మీద దాని ప్రభావం పరికించిన విశ్వనాథం కొంచెం విజయచిహ్నంగా నవ్వి "నీకు తెలియదన్నమాట ! ఆశ్చర్యంగా ఉంది సుమీ !" అన్నాడు.

నాకు ఒళ్ళు మండింది. అయినా కింది చేయి నాది !

"ఎవరితోనో తెలుసా ?" అనడిగాడు మళ్ళీ.

"ఎవరు ?"

"మన ఆఫీసరుగారమ్మాయి లేదూ - మిస్ ప్రేమ - ఆవిడ" అదిరిపడ్డాను.

'నీ కేమయినా మతిగాని పోయిందా ?'

'నాక్కాదు - నీకు పోతున్నట్లుంది. అక్షరాలా మన "ప్రేమ"తో ఐమన్ మన ఆఫీసరుగారి అమ్మాయితో"

నాకు నోట మాట రాలేదు.

"ఇంతకీ "ఎప్పుడ"న్న ప్రశ్నకి సమాధానం చెప్పలేదనుకుంటా. రేపు ఆదివారం నాడు మంత్రిగారొకాయన ఈ ఊరు వస్తున్నారట. వీరి పెళ్ళి ఆ రోజున ఆయన సమక్షంలో రిజిష్టారు ఆఫీసులో ఆదర్శ వివాహంగా మరి ! మరినే వస్తా" ఇంకోరి నెవరినయినా పట్టుకునేందుకు హడావుడిగా వెళ్ళిపోయాడు విశ్వనాథం

శంకరంతో నాకు గత ఏడాదిగా పరిచయం ఉంది. అంటే అతను ఆఫీసులో చేరినప్పటినుంచీ నన్నమాట. నలుగురితోనూ కలుపుగోలుగా ఉండి, సరదాగా కబుర్లుచెప్పి మనకు తెలియకుండానే మన దగ్గర ఉన్న ఒక్క రూపాయి ఒడుక్కుపోగల నేర్పున్నది అతనికి. అతనికి సైకిలు లేకపోయినా అతను ఆఫీసుకు నడిచి రావడం కాని పోవడంకాని నేనింత వరకు చూడలేదు. ఏ పరిదో వకరి సైకిలు మీద చేరేవాడు. ఎండలో కాళ్ళీడ్చుకుంటూ ఆఫీసుకు వెడుతున్న నాకు అతని చొరవ ఆశ్చర్యం కలిగించేది.

"నువ్వు బ్రతక నేర్చినవాడి వోయ్ శంకరం" అంటే పక పక నవ్వేశాడు. అతని నవ్వులోకూడా ఒక ప్రత్యేకత ఉంది.

నిజంగా అతను బ్రతక నేర్చినవాడే ! ఆఫీసులో చేరిన నెలకల్లా ఆఫీసరుగారి అప్తుల్లో ఒకడయాడు. ఇంకో రెండు నెలలు పోయేసరికి ఆఫీసరుగారి ఏకైక పుత్రికకి ఇంటర్ మిడియేట్ పరీక్షలకి సహాయపడమన్నారు. అప్పటి నుంచి "మిస్ ప్రేమ"కి మా శంకరం పాఠాలు చెప్పడం మొదలెట్టాడు. ఇక్కడ రెండు ముక్కలు ఆ అమ్మాయిని గురించికూడా చెప్పాలనుకుంటా - కథకి నాయిక ప్రస్తుతానికి ఆమె కాబట్టి.

ముఖంలో అట్టే అందం లేకపోయినా కళగా ఉండేది. చక్కని అవయవ నిర్మాణంతో ఒంపులు పూర్తిగా దిద్దుకున్న శరీరానికి చక్కని బట్టలు ఆకర్షణీయంగా అంటించినట్లు కట్టుకుని అందాన్ని ఇనుమడింపజేసుకునేది నడక మహా విలాసంగా. పురుషుల దృష్టిని ఆకట్టేట్టుగా జడకుచ్చులు ఎత్తైన భాగంమీద అటు ఇటు ఆడగా నడిచేది మొత్తానికి చూసిన మగవారిని రెచ్చగొడుతున్నట్టుగా ఉండేది ఆమె...

ఈ ప్రయివేటుకి శంకరాన్ని అభినందించనివారు, అతన్ని చూసి ఈర్ష్యపడని వారు లేరు మా ఆఫీసులో.

ఆ పాఠాలు ప్రేమ పాఠాలుగా మారి ఉంటాయని అనుమానించునుగాని ఇంత వరకు వస్తుందని కలలోకూడా అనుకోలేదు ఇద్దరివీ వేర్వేరు కులాలు.... శంకరం కనబడతాడేమోనని వెతికి వెతికి సాయంత్రం క్లబ్బులో పి.సి. దగ్గర పట్టుకున్నాను. బయటకు లాక్కొచ్చి "ఏం శంకరం, నేను విన్నది నిజమేనా? అనడిగాను.

" నిజమే గురూ " అన్నాడు చాలా యథాలాపంగా.

"మరి మీ వాళ్ళు ఒప్పుకుంటారా?" అనడిగాను ఆశ్చర్యంగా.

ప్రేమ వివాహాలు జరగడం విన్నాను కాని నాకు ఇంత దగ్గరలో జరగడం జీవితంలో ఇదే ప్రథమం కావడంవలన మాట మాటకి నాకు ఆశ్చర్యంగానే ఉంది. అసలు అంతెందుకు - శంకరాన్ని చూస్తేనే ఆశ్చర్యంగా ఉంది నాకు.

"నాకు 'నా' అన్నదల్లా మా అక్కయ్య ఒక్కతే; నన్ను పెంచి చదువు చెప్పించిందదే. అది నేనేంచెప్పినా ఒప్పుకుంటుంది. మా బావ నన్ను ఏనాడో ఎందుకూ పనికిరాని రీతిగా లెక్కకట్టేశాడు. దానికితోడు నేను ఆనర్స్ తప్పడంతో నాముఖం చూడటంకూడా తనకి అవమానంగా భావిస్తున్నాడు. అందుకే "పెద్ద ఉద్యోగమయితే నా కూతుర్నిచ్చి పెళ్ళిచేసేవాడిని - గుమస్తాగాడికి పిల్లనెవరిస్తారు అని అంటాడు" అని నవ్వి "కాబట్టి నేనెటుపోయినా అట్టే బాధపడరెవరూ" అన్నాడు.

అతని చివరి మాటలో లీలగా బాధ గోచరమయిన నాకు ఒకవేళ వీరందరినీ

ఏదో అవమానిద్దామని, వారిమీద దెబ్బతీద్దామని ఈ పనికి తలబడ్డాడా అన్న అనుమానం కలిగింది.

"ఈ వివాహం ఫలితాలు బాగా ఆలోచించావా?" అన్నాను ఆఖరిమాటగా.

"ఆఁ ఈ తొమ్మిది నెలలూ అదే పని"

ఇంకేం మాట్లాడనూ - "విష్ యూ ఎ స్మూత్ లైఫ్" అన్నాను పేలవంగా నవ్వేశాడు.

ఆదివారంనాడు రిజిష్ట్రారు ఆఫీసలో చప్పుడు లేకుండా సంతకాలయ్యాయి. మా ఊరు ఏదో పనిమీద వచ్చిన మంత్రిగారు అధ్యక్షులుగా సాయంత్రం టౌనుహాల్లో అభినందన సభ జరిగింది. వర్ణాంతర వివాహాల ఆవశ్యకతనుగురించి గంభీరంగా ఉపన్యసించారు మంత్రిగారు -

"....." మరో కులం అమ్మాయిని ధైర్యంగా వివాహమాడుతున్న శంకరంగారు అభినందనీయులు. ఈ రోజుల్లో ఇటువంటి యువకులు కావాలి. అప్పటికిగాని వర్ణవ్యవస్థ రూపుమాసిపోదు. ప్రభుత్వం ఇటువంటి వివాహాలని చేసుకున్నవారికి అయిదు ఎకరాలు భూమి ఇచ్చి ప్రోత్సహించాలని నిశ్చయించింది. దానికి తోడు నా వ్యక్తిగతాభిప్రాయం ఏమంటే ఉద్యోగాల్లోకూడా ఇటువంటివారికి ప్రమోషన్లు ఇచ్చి మిగిలిన వారినికూడా ఆకర్షించాలి. మొదట్లో ఇలా చేయక తప్పదు. కాబట్టి శంకరంగారు పైకిరావాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను" అన్నారాయన.

నాకు పెళ్ళికాకుండా ఉండి ఉంటే బహుశ ఆ క్షణంలో కంటికి కనబడ్డ దాన్ని చేసుకొందును!

తరువాత మా ఆఫీసరు శంకరాన్ని తీసుకుని మంత్రిగారు ఉంటున్న ట్రావెలర్స్ బంగళాకి వెళ్ళి మాట్లాడి వచ్చారు.

ఇది జరిగిన రెండు నెలలకి మా కంపెనీ కొత్తగా పెట్టిన బ్రాంచికి మానేజరుగా ప్రమోషను మీద బదిలీ అయిన శంకరంకి వీడుకోలు ఇచ్చాం. మామూలుగా పదేళ్ళ సర్వీసయినా లేనిదే రానిదాన్ని తపీమని సంపాయించాడు. మా ఆఫీసరుగారికి ఉన్న పరపతి అటువంటిది. ఏడవలేక నవ్వుతూ "విష్ యు గుడ్ లక్" అన్నారంతా. నాకు మాత్రం ఈ ప్రమోషన్ ఆశ్చర్యం కలిగించలేదు.

రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. ఈ లోపల మా ఆఫీసరు రిటైరయి వెళ్ళిపోవడంతో శంకరం ఉనికి మాకు తెలియలేదు. పైగా శ్లేష్మంలోపడ్డ ఈగల్లాగా గుమస్తాగిరితో సతమతమవుతున్న మాకు మా పరిధిని మించి ఆలోచన పోదుకూడా!

ఒక్క ఊళ్ళో మూడు సంవత్సరాలు గడిపావుగాబట్టి నిన్ను మరో ఊరుకి వేస్తున్నామన్నారు నన్ను "చిత్తం" అంటూ పెట్టె, బెడ్డింగు సర్దుకుని శ్రీమతిని పుట్టింటికి ప్రయాణం కట్టించి, ఇల్లు నెల లోపల కుదురుస్తానన్న హామీతో రైలెక్కించి నేను మరో రైలెక్కాను. అసలే వెళ్ళబోయేది పెద్ద పట్నం. అందులో హెడ్డాఫీసు - ఎలా నిభాయించుకుంటానో అన్న బెంగతో ఆ ఊళ్ళో అడుగుపెట్టాను. ఒక హోటల్లో దిగి భోజనం అదీ ముగించి డ్యూటీలో జాయినయ్యే ముందు ఊరు చూద్దామని బయలుదేరిన నాకు "మిస్టర్ రావ్" అన్న పిలుపు వినబడింది!

ఈ మహాపట్టణంలో నన్నెవరు పిలుస్తారా అన్న సందేహంతోనే వెనక్కి తిరిగాను.

శంకరం!

లాంబ్రెట్టామీద కూర్చుని కాలు నేల కానించి చిరునవ్వుతో ఠీవిలాసంగా సిగరెట్టు కాలుస్తున్నాడు. కొత్తగా పరిచయం లేని ఊరిలో పాత మిత్రుడ్ని చూడడం ఆనందం కలిగించినా అతని వేషం నా ఉత్సాహాన్ని చంపేసింది. ముడత నలగని గాబర్డీను సూటులోంచి సిల్కు షర్ట్, మెరుస్తున్న బెల్టు కనబడుతున్నాయి. తలమీద హేటు....

"ఏమిటోయ్ రావ్ అలా చూస్తావు? నువ్వు ఇక్కడికి వస్తావని నాకు తెలుసు. నేనిక్కడున్నానని నీకు తెలియదా?" అనడిగాడు నవ్వుతూ.

అది అధికారి గుమాస్తాని చూసి జాలిపడే నవ్వు!

"తె.... తెలియదు" అన్నాను సాధ్యమయినంత గాంభీర్యాన్ని, చిరునవ్వుని ముఖాన పులుపుకుని

"ఇక్కడే అసిస్టెంటు ఆఫీసరుగా ఉన్నాను ఎక్స్‌పోర్టు సైడున! అసలెక్కడ దిగావు - ఏమిటి కథ? అలా ఒకసారి మా ఇంటికి వెడదాం రారాదూ?" అంటూ తన వెనక నున్న సీటును చూపించాడు.

నా పరిస్థితి నాకే జాలి కలిగించేదిగా ఉంది. ఒకప్పుడు నాతోపాటు పనిచేసి, నాతో సమానంగా ఆఫీసర్లని చూసి ఈర్ష్యపడిన శంకరం ఇప్పుడు నా మీద ఆఫీసరు, అతన్ని "నువ్వు" అనకూడదు "మీరు" అని అనవలెను.

'రావోయ్ మాటమాటకి ఆలోచనల్లో పడిపోతావేం - ఫామిలీని విడిచి వచ్చానని దిగులా?'

ఇక చేసేదిలేక వెళ్ళి వెనక కూర్చున్నాను. అసలే నాకు మోటారుసైకిలెక్కడం కొత్త. ఎదుటనున్న మనిషి బుజాలు పుచ్చుకోవడం రివాజనుకుంటా. రివాజు మాట అలావుంచి పుచ్చుకోకపోతే గుమ్మడికాయలా రోడ్డుమీదికి దొర్లటం ఖాయం! విధిలేక చేతులు బాగా తుడుచుకుని అతని బుజాలమీద వేశాను!

అప్పుడు నా ప్రస్తుత పరిస్థితి కొంతవరకు అవతలికి నెట్టి ఎదుర్కోబోయే సన్నివేశాన్నిగురించి ఊహించసాగాను.

శంకరం చేసుకున్నది వర్ణాంతర వివాహం అందులోనూ తక్కువకులం అని చెప్పబడేది - దాని పేరుతో మనకి సంబంధం లేదు. నేను నిజం చెప్పాలంటే కొంచెం శ్రోత్రియుడినే. ఆ విషయం మేమిద్దరం బాగా పరిచయంగా ఉండే రోజుల్లో శంకరంకి తెలుసు. అప్పట్లో అతను నన్ను ఎక్కిరించేవాడు కూడా! ఇప్పుడు నన్ను పనివేళా ఇంటికి రమ్మనడంలో అతని ఉద్దేశం ఏమిటి? నా నియమాల్ని హేళనచేద్దామనా!.... ఒక్క కుదు

పుతో ఆగడంతో మళ్ళీ ప్రస్తుతంలోకి పడిదిగాను.

చిన్నసైజు బంగళా అనదగ్గ ఇల్లు. దానికి రెండు ప్రక్కలా చక్కని పూల మొక్కలు, తలుపులకి, కిటికీలకి తెరలు - నా కంటికి అదేదో సినిమా సెట్టింగులా ఉంది.

ఒక దాదిలాగుంది - సంవత్సరంలోపు వయస్సున్న పసిపిల్లాడిని ఎత్తుకుని ఆడిస్తోంది. ఉత్సాహం పట్టలేక ఆ పిల్లాడివంక పరీక్షగా చూశాను. నే నాశించిన పోలికలేమీ కనబడకపోగా బంతిలాగా ఉండి ఆరోగ్యంగా చాలా అందంగా ఉన్నాడు. శంకరంని చూసి చేతులు చాచాడు.

"నాట్ నౌ - " అని వాడి బుగ్గమీద చిన్నగా కొట్టి "కులదీపకుడు" అని నవ్వాడు నా వంక చూసి.

నేనూ నవ్వేశాను.

ఇద్దరం కలిసి ఇంటిలోకి వెళ్ళాం. డ్రాయింగ్ రూం చాలా అందంగా ఉంది, అందులోనూ శ్రద్ధగల గృహిణి నేర్పు జూపెడుతున్నాయి అక్కడి ప్రతి వస్తువును!! నా కిదంతా ఆశ్చర్యంగా ఉంది నేనూహించినదానికి, చూస్తున్నదానికి చాలా వ్యత్యాసం కనబడింది.

"కూర్చో" అని నా కొక సోఫా చూపించి తనొక సోఫాలో కూలబడి బూట్లు విప్పుతుంటూ 'ఇందిరా, రెండు కప్పులు కాఫీ పట్టుకురా' అని కేకేశాడు

ఉలిక్కి పడ్డాను. నాకు తెలిసినంత వరకు శంకరం భార్య పేరు ఇందిర కాదు- మిస్ ప్రేమ. కాకపోతే ఇప్పుడు శ్రీమతి ప్రేమ అయితే మరి....

ఒంటినిండా పమిట కప్పుకుని ట్రేలో రెండు కాఫీ కప్పులు తీసుకుని వచ్చిన ఆమెనిచూసి ఆశ్చర్యపోయాను. నుదుట ఎర్రటి పెద్ద బొట్టు, కళ్ళనిండా కాటుక పట్టుచీర, వెల్వెట్ రవిక, మెడలో రాళ్ళ నెక్లెస్ - లక్ష్మీదేవిలా ఉండి చూసేవారికి ఆమెపట్ల గౌరవాన్ని కలిగించేదిగా ఉంది ఆమె రూపం, అలంకరణ.

"నా మిసెస్ ఇందిర. ఇతను మా ఆఫీసులోనే పని చేస్తున్నాడు" అంటూ పరిచయం చేశాడు శంకరం.

"నమస్కారమండి" అని నిండుగా నవ్వి లోపలికి వెళ్ళిపోయింది

నాకు మట్టుకు ఈ మిస్టరీ అర్థంకాలేదు. అతను పూర్వపు స్థితిలో ఉండినట్లయితే వీపుమీద కొట్టి మరీ అడిగేవాడిని - "ఎమిటోయ్ కథ" అని.

కాసేపు అవీ ఇవీ మాట్లాడాము అతను ఈ విషయం గురించి చెపుతాడేమోనని ఆశపడ్డ నాకు నిరాశే ఎదురయింది. చివరికి శలవు తీసుకుని బయల్దేరాను. "దీని వెనకనున్న రహస్యం నాకు విడమర్చి చెప్పేవాడెవరు ఈ ఊళ్ళో" అని అనుకుంటుండగానే "నేను తానూ" అన్నట్టు వెలిశాడు సంజీవరావు.

"హలోవ్ బ్రదర్ - ఇదేనా రావడం? నే నెరిగిన ఒక ప్రాణి ఇక్కడికి దిగబడుతున్నాడంటే ఎంతో ఆనందించాను కాని నువ్వు ఇంత త్వరలో వస్తావనుకోలేదు రా, రా, కాఫీ తాగుదాం" అన్నాడు

"శంకరం ఇంట్లో కాఫీ తాగి వస్తున్నాను లే" అని అతని వంక నిశితంగా చూశాను. అతను కూడా శంకరం గుమాస్తాగా గడిపిన రోజుల్లో ఉన్నవాడే

'అయితే చూశావన్నమాట!' అన్నాడు ఆశ్చర్యంగా కండ్లు పెద్దవి చేస్తూ.

'ఎవరిని?' అన్నాను - అతని చేతే చెప్పించాలని.

''ఇంకెవరు? శంకరంగాడి ధర్మపత్నిని....జీనియస్ అంటే వాడు బ్రదర్'' అని ఫెళ్ళున నవ్వాడు.

ఇక దాగుడు మూతలతో పనిలేదని "అసలు కాథేమిటి గురూ?" అనడిగాను.

నీకు తెలియదన్నమాట? అవునులే ఎలా తెలుస్తుంది- నాకయినా ఇక్కడికి వచ్చాకేగా తెలిసింది." అని ఆపి సిగిరెట్టు ఒరలో తను తీసుకుని నాకొకటి ఇచ్చి అగ్గిపుల్ల వెలిగించాడు.

''మన వాడు మనందరి ఎదటా చేసుకున్నది మన ఆఫీసరు కూతుర్నికదూ! ఆ అమ్మాయి పేరు మిస్ ప్రేమ. అదొక వన్నెల విసిని కర్ర. అల్లుడుకదా అని చెప్పి మన ఆఫీసరుగారు మానేజింగ్ డైరక్టర్ దగ్గర తనకున్న పలుకుబడినంతా వినియోగించి వీడికి ప్రమోషన్లు తెప్పించాడు. అందునా మనవాడు వసుధ! కలుపుగోలు మనిషి. హెడ్డాఫీసుకు రాంగానే అందరిని మంచిచేసుకుని పలుకుబడి అరిచేతిమందాన పెంచాడు. ఇంతలో మన ఆఫీసరు అంటే వాడి మావగారు రిటైరయాడు. వీడికి ఆయనతో అవసరమూ తీరిపోయింది. అక్కడినుంచి ఆ అమ్మాయిని నానా ఏడుపూ ఏడిపించి ఆవిడే వీడిని వదిలేసి లేచిపోయేట్టుగా చేశాడు" అని నవ్వాడు.

"అంటే?"

'కొట్టక్కరలా, తిట్టక్కరలా - ఊదర కొడితే వాడే పోతాడన్నట్టు ఆ అమ్మాయిని సరిగా చూడక, కొట్టి నానా రభసా చేశాడు. అసలే ఆ అమ్మడు పాతివ్రత్యం మీద అట్టే గురి గౌరవం లేనిది. పైగా వాళ్ళ నాన్న సంపాయించినదానికి వారసురాలు

''నువ్వు లేకపోతే నీ తల్లో జేజెమ్మ" అని ఇంకోడిని చేరదీసి వాడితో లేచిపోయింది. వాళ్ళిద్దరికి మొదట పరిచయం చేసింది శంకరమే!

ఆవిడ పోవడంతో లైన్ క్లియరయింది. వాళ్ళ అక్కయ్యగారింటికివెళ్ళి జరిగినదంతా ఒక పీడ కలగా మరిచిపొమ్మన్నాడు. 'పెద్ద ఆఫీసరు - అందులోనూ మంచి భవిష్యత్తు ఉన్నవాడు పైగా తన భార్యకి, కూతురుకి అతనంటే పంచప్రాణాలు - మధ్యన తను కాదనడం ఎందుకు? అయినా కాదనవలసిన అవసరం మాత్రం ఏముంది?" అని చెప్పి శంకరం బావగారు వెంటనే వీడి కాళ్ళు కడిగి కూతుర్ని చేతిలో పెట్టాడు ఆవిడే ఇందిర!

(తరువాయి 28 వ పేజీలో)

## పుస్తక సమీక్ష

(25 వ పేజీ తరువాయి)

'చరిత్రలో మాకూ ఇంత
చోటు కల్పించవూ? ఓ కవీ!'

అని నిదుర కన్నులు కవిని నిలదీసి అడుగుతాయి.

ఆనిదరకు కన్నులు అడగ్గా అడగ్గా నిదరకు కరవాచే కవిగారినే అడగాలా!

చిక్కటి కవిత్వం! అయితే, అభివృద్ధికి రావలసిన కవికి నిరాశా పూరిత ఆలోచనా జగత్తు శరణ్యం కారాదు. అది ఒకనాటి 'ఫాషన్'.

కవి, ప్రథమంలో వ్రాసిన పదకొండు పేరాల వచనంకాని వచనం ఈ సంపుటికి శుద్ధ దండుగ. అచ్చు తప్పులు ఎక్కువగా దొర్లాయి ప్రతులు ఎక్కడ దొరకుతాయో ముద్రింపించలేదు.

## ప్రయోజకుడు

(19 వ పేజీ తరువాయి)

నిర్ఘాంత పోయాను మూడు సంవత్సరాల కాలంలో సినిమా కధంత కధ స్వయంగా నడిపాడు శంకరం. పిడి తెలివికి, ముందు చూపుకి భగవంతుడు కూడా అనుకూలించి అనుకున్నదంతా అక్షరాలా జరిపించాడు!

"మొత్తానికి శంకరం బ్రతకనేర్చినవాడు సుమీ!" అన్నాను మెల్లిగా.

సంజీవి ఫెళ్లున నవ్వి "కాకపోతే మన లాగా అనుకున్నావేమిటి - అదే ఉద్యోగాన్ని, అదే భార్యని భరించటానికి" అన్నారు


## చుక్కాని

ఆంధ్రుల అభిమాన పత్రిక
నేడే చందా దారులుగా చేరండి
సాలు చందా రు 4-50 మాత్రమే


★

# ఉగాది సంచిక నుంచి కొత్తశీర్షిక

## కథాలోకనం

ఈనాడు వివిధ పత్రికలలో ఎన్నో కధలు ప్రచురింపబడుతున్నాయి. అవన్నీ చదివి అందులో మంచి కధలను మా పాఠకులకు పరిచయం చేయాలని సంకల్పించుచున్నాం. ఈ కథావలోకనం నెలకొకసారి జరుగుతుంది. ఉత్తమ కధ పట్ల పాఠకులకు ఆసక్తి కలిగించడం, ఉత్తమ కథా రచనకు రచయితకు దోహదమివ్వడమే ఈ శీర్షిక లక్ష్యం.

★


ఇటీవల బందరు పురమందిరంలో భారతీ సమితి ఆధ్వర్యమున కృతి సమర్పణ మహోత్సవం జరిగింది.

శబ్దోత్పత్తి శతకకర్త



శ్రీ కోగంటి దుర్గామల్లిఖార్జునరావు

శబ్దోత్పత్తి శతకభర్త



శ్రీ వాకాటి పెంచలరెడ్డి